● డిగ్రీ చదువుతున్న ఓ యువకుడు కరీంనగర్‌లోని ఓ మెడికల్ దుకాణానికి వెళ్లి నొప్పులకు ఉపయోగించే పది మాత్రలు ఉండే ఓ షీట్‌ను ఇటీవల కొనుగోలు చేసి తీసుకెళ్లాడు. మత్తుకోసం వాటిని ఉపయోగిస్తున్నాడు.

● కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పలు మెడికల్ దుకాణాల్లో నొప్పుల మాత్రలను ఇష్టమొచ్చినట్లు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఓ మెడికల్ దుకాణంపై అధికారులు, పోలీసులు దాడి కేసు నమోదు చేశారు. ఆగస్టులో పెద్దపల్లి జిల్లాలో ఈ మాత్రలు విక్రయిస్తున్న అంశంపై కేసు నమోదైంది. మంథనిలోనూ కేసు నమోదు చేశారు.

ఏ మాత్రం పట్టదు..

● ప్రిస్క్రిప్షన్ లేకున్నా దుకాణాల్లో అమ్మకాలు
● ఔషధాల 'మత్తు'లో యువత

న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం

వైద్యుల చీటీ లేకుండా కొన్ని రకాల ఔషధాలు విక్రయించకూడదనే నిబంధనలున్నా ఉమ్మడి జిల్లాలోని మెడికల్ దుకాణాల యజమానులు పట్టించుకోవడం లేదు. దీంతో మత్తుకు అలవాటుపడిన కొందరు నొప్పుల మాత్రలు కొనుగోలు చేసి వినియోగిస్తూ రోజంతా మత్తులో జోగుతున్నారు. సంబంధిత అధికారులు వీటిని పట్టించుకోకపోవడంతో విచ్చలవిడిగా ఈ వ్యాపారం సాగుతోంది.

రెట్టింపు ధరలకు..

● పలు రకాల నొప్పులు నయం కావడానికి వైద్యులు రాసే మాత్రలు వాడినప్పుడు నొప్పి తగ్గడంతోపాటు కాస్త మత్తు వచ్చినట్లు ఉంటుంది. కానీ ఈ మాత్రలను యువతతోపాటు అసంఘటిత రంగాల్లో పని చేసేవారు, లారీల డ్రైవర్లు, క్లీనర్లు కొనుక్కుని సూది మందులా వినియోగించి మత్తులో జోగుతున్నారు.

● కరీంనగర్‌లో మాత్రలను కొనుగోలు చేసి రెట్టింపు ధరకు ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాతోపాటు ఆసిఫాబాద్, నిజామాబాద్, మంచిర్యాల తదితర ప్రాంతాల వారికి ఇక్కడి నుంచే సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది.

గతంలో దగ్గు మందు

మత్తులో ఉండేందుకు కొందరు కార్మికులు యువత గతంలో కొన్ని దగ్గు సిరప్‌లు తాగేవారు. వాటిని నిషేధించిన తర్వాత వైట్నర్ వాడారు. ఇప్పుడు నేరుగా నొప్పి మాత్రలను నీళ్లలో కలుపుకొని సూది మందులా వినియోగిస్తున్నారు.

మెదడు దెబ్బతింటుంది

సాధారణంగా ఈ మాత్రలు నొప్పులు తగ్గడం కోసం అవసరమైన మేరకు రాస్తుంటాం. రోగులు మాత్రమే వాడాలి. ఆరోగ్యంగా ఉన్న యువత వాడితే మెదడు దెబ్బతింటుంది. మత్తులో ఉంటారు. ఒక్కోసారి నిద్రలో అకస్మాత్తుగా వచ్చిన ఆలోచనలతో ఇష్టం ఉన్నట్లు వ్యవహరిస్తారు. ఆలోచన ధోరణి మారుతుంది.

- డాక్టర్ ఎం.విజయమోహన్‌రెడ్డి, సీనియర్ ఫిజీషియన్

లైసెన్స్‌లు రద్దు చేస్తాం

డాక్టర్ చీటీ లేకుండా ఇలాంటి మాత్రలు విక్రయించే వారి సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. మెడికల్ షాపుల లైసెన్స్ రద్దు చేస్తాం. ఇప్పటి వరకు రెండు కేసులు నమోదు చేశాం.

- శ్రవణ్‌కుమార్, జిల్లా ఔషధ నియంత్రణాధికారి, కరీంనగర్

తటాకం.. కలుషితం

జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువులో సమీప కాలనీకి చెందిన మురుగునీరు చెరువులోకి చేరడంతో కలుషితం అవుతోంది. దీంతో అందులోని చేపలు మృత్యువాత పడుతున్నాయి. మత్స్యకారులు ఆందోళనకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు మురుగు బయటకు వెళ్లేలా చూడాలని కోరుతున్నారు. **- చిత్రం: న్యూస్‌టుడే, జగిత్యాల**

ఆలయ ఆస్తులు.. అన్యుల పాలు

అంజన్న భూములు అన్యాక్రాంతమైనా చర్యలు శూన్యం

న్యూస్‌టుడే, మల్యాల

నిఘా

కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ భూములపై పలువురు కన్నేశారు. జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారిని ఆనుకుని కొండగట్టు స్టేజి వద్దగల రూ.కోట్లాది విలువైన అంజన్న భూములను కొందరు ఆక్రమించుకుని పలు నిర్మాణాలు చేపట్టారు. దీనిపై అధికారులు గతంలో పలుమార్లు సర్వే చేపట్టినప్పటికీ హద్దులు ఏర్పాటు చేసి కంచె నిర్మాణం చేపట్టలేదు. ఆక్రమణదారులను దేవాదాయశాఖ అధికారులు ఖాళీ చేయించకపోవడంతో ఆలయ భూమి అన్యాక్రాంతం అవుతోంది.

కొండగట్టు స్టేజి వద్ద విలువైన భూమిలో పలు నిర్మాణాలు

ఆక్రమణలు తొలగించేలా చూస్తున్నాం

కొండగట్టు అంజన్న ఆలయం పేరిట ఉన్న భూములను రక్షించడానికి కృషి చేస్తున్నాం. కొండగట్టు స్టేజి వద్దగల ఆలయ భూమిలో ఒకరు భవన నిర్మాణం చేపట్టడంతో నిలిపివేయించి సర్వే కూడా చేయించాం. ఇందుకు సంబంధించిన భూ సమస్య కోర్టులో ఉండటంతో వేచి చూస్తున్నాం. విలువైన ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండటానికి కొండగట్టు స్టేజి వద్ద దుకాణ భవన సముదాయం నిర్మించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదించాం. ఆలయ భూములు ఆక్రమించుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- అంజనారెడ్డి, ఆలయ ఈవో, కొండగట్టు

స్వామి.. చర్యలేవి

ఆలయానికి చెందిన 380/సీ సర్వే నంబరులోని భూమిలో అక్రమ నిర్మాణం చేపట్టిన వ్యక్తికి ఆలయ ఈవో ఫిర్యాదు మేరకు గ్రామపంచాయతీ అధికారులు అయిదు నెలల కిందట నోటీసులు జారీ చేసినప్పటికీ ఇంతవరకు చర్యలు లేవు. ఇదే స్థలంలో ఏళ్ల క్రితమే పలువురు అక్రమంగా షెడ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టారు. ఆలయ భూముల ఆక్రమణలో కొందరి నాయకుల హస్తం కూడా ఉన్నట్లు తెలిసింది.

● కొడిమ్యాల మండలం తిమ్మయపల్లె, రాంసాగర్ శివారులోని భూములు కూడా ఆక్రమణకు గురవుతున్నట్లు సమాచారం. కొండగట్టు ప్రాంతంలోని సంతొల్లలొద్ది చెక్‌డ్యాం సమీపంలోనూ ఆలయానికి చెందిన దాదాపు 3 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించినా ఇంతవరకు దాని స్వాధీనానికి చర్యలు తీసుకోలేదు. కొందరు ఆలయ అధికారుల అండతోనే ఆక్రమణదారులు ఆలయ భూముల్లో తిష్ఠ వేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● కొండగట్టులో 22 ఎకరాల స్థలంలో అంజన్న ఆలయం విస్తరించి ఉంది. దీనికితోడు మల్యాల, కొడిమ్యాల శివారులో దాదాపు 25 ఎకరాలకుపైగా విలువైన వ్యవసాయ, భవన నిర్మాణాలకు అనువైన భూములున్నాయి. ఆలయ భూముల పరిరక్షణకు పోలీసుల సహకారంతో దేవాదాయశాఖ ఉన్నతాధికారులు సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేయడంతోపాటు ఆక్రమణలను తొలగించి, ఆక్రమణదారులను ఖాళీ చేయిస్తేనే అంజన్న భూములు దక్కుతాయని భక్తులు పేర్కొంటున్నారు.

నాయకుల హస్తం.. అక్రమ తవ్వకం

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల పరిధి అయిలాపూర్ శివారులోని గుట్ట మట్టిని అక్రమంగా తవ్వి పట్టణంలో విక్రయిస్తున్నారంటూ సోమవారం స్థానికులు గ్రామపంచాయతీ వద్ద ఆందోళన చేపట్టారు. గ్రామానికి చెందిన కొద్దిమంది నాయకులు కోరుట్లకు చెందిన మట్టి వ్యాపారులతో చేతులు కలిపి అక్రమంగా వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ కృష్ణచైతన్యకు వినతిపత్రం అందించారు. దీంతో మట్టి తవ్వకుండా చర్యలు తీసుకోవాలని జీపీవో, ఆర్‌ఐను తహసీల్దార్ ఆదేశించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

రైతేరాజు 6లో

తెలియని వయసు.. ఆకర్షణ ఉచ్చు

● జిల్లాలో పెరుగుతున్న పోక్సో కేసులు
● తల్లిదండ్రుల జాగ్రత్తలే రక్షణ

న్యూస్‌టుడే, జగిత్యాల గ్రామీణం

పట్టుమని పదహారేళ్లు కూడా నిండని వయసు. దీనికి తోడు సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా మోజులో పడి కొందరు దారి తప్పుతున్నారు. అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని కొందరు యువకులు మైనర్ బాలికలను లొంగదీసుకుని మోసం చేస్తున్నారు. జిల్లాలో గతేడాది 36 కేసులు నమోదైతే.. ఏడుగురికి శిక్షలు ఖరారయ్యాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 38కిపైగా కేసులు నమోదు కాగా.. నలుగురికి శిక్ష పడినట్లు పోలీసులు తెలిపారు.

ప్రేమ పేరుతో మోసం

ప్రేమ పేరుతో కొందరు యువకులు.. ఇంటర్, పదోతరగతి చదువుతున్న వారికి దగ్గరవుతున్నారు. ఆకర్షణకు లోనవుతూ బాలికలు యువకుల వలలో పడిపోతున్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లలు చదువుతున్నారు అనుకొని వారిని పట్టించుకోవటం లేదు. జిల్లాలో ఇటీవల జరిగిన ఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

జరిగిన ఘటనలు..

● జిల్లాలో ఓ పాఠశాల విద్యార్థిని సోషల్ మీడియా ద్వారా ఓ యువకుడికి సందేశాలు పంపించడం తల్లిదండ్రులు గమనించారు. దీంతో పెళ్లి చేయాలని నిర్ణయించారు. దీంతో ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయింది.

● కొడిమ్యాల మండలంలో ఇద్దరు మైనర్లను ప్రేమ పేరుతో మోసం చేసిన ఘటన వెలుగు చూసింది.

● గొల్లపల్లి మండలంలో ఇటీవల ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది.

● జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోనూ ఓ బాలికపై అత్యాచారం జరగగా.. పోక్సో కేసు నమోదు నమోదైంది. మెట్‌పల్లి డివిజన్‌లో ఇటీవల ఒక పోక్సో కేసు నమోదు చేశారు.

తల్లిదండ్రులు గమనిస్తేనే..

● పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వకుండా జాగ్రత్తపడాలి. ఇస్తే చరవాణిని పరిశీలించాలి

● వారి సోషల్ మీడియా అకౌంట్లను పరిశీలించాలి.

● పిల్లలు చదువుతున్న గదులను పరిశీలించి అనుమానం వస్తే వారితో మాట్లాడి మోసం జరిగితే వారికి అవగాహన కల్పించి మార్చాలి.

● ఏదైనా తప్పు జరిగినట్లు తెలిస్తే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే బాధితుల పేర్లు బయటకు చెప్పకుండా పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి శిక్ష పడేలా పోలీసులు దర్యాప్తు చేస్తారు.

● సఖి కేంద్రంలోనూ సంప్రదిస్తే వారు న్యాయ, వైద్యం సాయం అందిస్తారు.

జిల్లాలో పోక్సో కేసుల నమోదు, శిక్షలు

సంవత్సరం	కేసుల సంఖ్య	శిక్షలు
2025	36	07
2026	38	04

సోమేశ్వర కొండ.. భక్తుల మదినిండా

మెట్లమార్గంలో కొండపైకి చేరుకుంటున్న భక్తులు

న్యూస్‌టుడే, మల్లాపూర్: శ్రీకనక సోమేశ్వర స్వామి కొండకు సోమవారం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం మూడో సోమవారం పురస్కరించుకుని పలు ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు మెట్ల మార్గంలో కొండపైకి చేరుకున్నారు. స్వామివారికి అభిషేకాలు చేసి.. వరదపాయసం(బెల్లంతో వండిన అన్నం)ను నైవేద్యంగా సమర్పించారు. దేవాలయ కమిటీ ఛైర్మన్ సురేష్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు. కొండ చుట్టూ పచ్చని పంట పొలాలు, వెనుక వైపు ప్రవహిస్తున్న గోదావరి తీర అందాలు ఆకట్టుకున్నాయి.

చేయూతకు దరఖాస్తుల వెల్లువ

ఉమ్మడి జిల్లాలో 52,433 నమోదు

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్, జగిత్యాల విద్యానగర్

సుదీర్ఘ కాలం తర్వాత ప్రభుత్వం చేయూత(ఆసరా) పథకంలో పింఛన్ పొందేందుకు అవకాశం కల్పించింది. అర్హులు ఆధార పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించింది. ఈ క్రమంలో ఆశావహులు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. అవసరమైన పత్రాలతో మీసేవ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, రామగుండం నగరపాలక సంస్థలు కావడంతో పంచాయతీల్లోనే భారీగా దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం నాటికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 52,433 దరఖాస్తులు వచ్చాయి.

ఉమ్మడి జిల్లాలో దరఖాస్తుల వివరాలు

	జగిత్యాల	కరీంనగర్	పెద్దపల్లి	రాజన్నసిరిసిల్ల
వితంతు	5,732	8,542	7,112	3,571
ఒంటరి మహిళా	1,086	983	869	301
దివ్యాంగులు	2,266	6,559	2,836	1,808
చేనేత	2,191	1,122	469	937
గీత కార్మిక	1,970	1,745	1,305	1,018

అనర్హులను తొలగించి జాబితా..

ఉమ్మడి జిల్లాలో 52,433 దరఖాస్తులు రాగా వీటిలో జగిత్యాలలో 13,256, కరీంనగర్ 18,951, పెద్దపల్లిలో 12,591, రాజన్న సిరిసిల్లలో 7,635 దరఖాస్తులు నమోదయ్యాయి. వీటిలో అత్యధికంగా వితంతువులు 24,957, తర్వాత 13,469 దివ్యాంగులు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవో, మున్సిపల్ పరిధిలో కమిషనర్ పర్యవేక్షణలో దరఖాస్తులు పరిశీలించనున్నారు. అక్రమాలకు తావులేకుండా 360 డిగ్రీల సాంకేతిక విధానంతో వడబోత చేపట్టనున్నారు. అనర్హులను తొలగించి జాబితా రూపొందించనున్నారు.

తప్పని దళారుల బెడద..

చేయూత పింఛన్ కోసం దరఖాస్తుల స్వీకరణ మొదలు నుంచి దళారులు అమాయకులను మచ్చిక చేసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో కొందరు ప్రజాప్రతినిధులు బేరసారాలు కుదుర్చుకుంటున్నారు. ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగిన బాధితులు అడిగినంతా ఇచ్చేందుకు అంగీకరిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. రామగుండంలో ప్రజాప్రతినిధుల జోక్యంపై ఆరోపణలు రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్లు స్పందిస్తూ దళారులను ఆశ్రయించరాదని ప్రకటనలు చేస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోతోంది.

ప్రారంభానికి సిద్ధం.. మహిళా శక్తి భవనం

జగిత్యాల ధరూర్‌క్యాంపులో రూ.6.17 కోట్ల వ్యయంతో 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనం ప్రారంభానికి సిద్ధమైంది. సమావేశ మందిరాలు, విశ్రాంతి గదులు, హాస్టల్ వసతి, క్యాంటీన్, సిబ్బంది గదులు, జిల్లా సమాఖ్య సమావేశ మందిరం తదితరాలతో ఏర్పాటైన ఈ భవనాన్ని వచ్చే నెల మొదటివారంలో ప్రారంభించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని మండలాలకు చెందిన మహిళలకు పలు రంగాల్లో శిక్షణ, సంఘాల సమావేశాలు, ఉత్పత్తుల ప్రదర్శన, మార్కెటింగ్ తదితరాలన్నీ ఈ భవనంలోనే నిర్వహించనున్నారు.

- న్యూస్‌టుడే, జగిత్యాల ధరూర్‌క్యాంపు

నెల రోజులపాటు పోలీసు చట్టం

జగిత్యాల, న్యూస్‌టుడే: జిల్లాలో నెలరోజులపాటు పోలీసు చట్టం అమలులో ఉంటుందని ఎస్పీ అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 1 నుంచి 30 వరకు పోలీసు అధికారుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు, నిరసనలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని.. నిబంధనలకు విరుద్ధంగా డీజే వినియోగించరాదన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం చేసే చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాల తేదీ పొడిగింపు

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఓపెన్ స్కూల్ ప్రవేశాల తేదీని సెప్టెంబరు 15 వరకు పొడిగించినట్లు ఉమ్మడి జిల్లా సమన్వయకర్త రామడుగు రవీందర్, జగిత్యాల సమన్వయకర్త శ్యాం తెలిపారు. 14 ఏళ్లు నిండినవారు పదో తరగతికి.. 15 సంవత్సరాలు నిండినవారు ఇంటర్మీడియట్‌కు అర్హులు. అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బతుకు భారంగా.. బరువెక్కిన నిరీక్షణ

● చేపపిల్లల పంపిణీలో జాప్యం
● మత్స్యకారుల ఆవేదన

న్యూస్‌టుడే, జగిత్యాల వాణిజ్యం

రాష్ట్రప్రభుత్వం చేపపిల్లల ఉచిత పంపిణీకి గతనెల 6 నుంచి టెండర్ల ప్రక్రియ నిర్వహించగా.. జగిత్యాల జిల్లా నుంచి ఒక్క టెండరు కూడా దాఖలు కాలేదు. దీంతో జిల్లాలో చేపపిల్లల పంపిణీ ఆలస్యం కానుండటంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 2025-26 సీజన్‌లో 765 చెరువుల్లో 1.69 కోట్ల చేపపిల్లల పంపిణీ లక్ష్యంలో కేవలం 50 లక్షలను మాత్రమే వదిలారు. 8 లక్షల రొయ్య పిల్లలను వదలడం లక్ష్యంగా ఉన్నా పంపిణీ చేయలేదు. ప్రస్తుతం 2026-27 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 1.69 కోట్ల చేపపిల్లలు, 7 లక్షల రొయ్య పిల్లల పంపిణీకి అనుమతించారు.

పది శాతం ధర పెంపు

మత్స్యశాఖ నిరుటి కన్నా 10 శాతం ధరను పెంచి 35-40 మిల్లీమీటర్ల పరిమాణం గల లక్ష చేప పిల్లలకు రూ.62,670 ధరను, 80-100 మిల్లీమీటర్ల సైజు గల లక్ష చేప పిల్లలకు రూ.1,66,130 ధరను నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలో 54 లక్షల చిన్నసైజు చేపపిల్లలు, 1.15 కోట్ల పెద్ద సైజు చేపపిల్లలను సరఫరా చేసేందుకు టెండర్లను పిలవగా.. ఈ ధర కూడా తమకు గిట్టుబాటు కాదని, అంతకుముందు సంవత్సరానికి చెందిన బిల్లులను చెల్లించలేదనే కారణాలతో గుత్తేదారులు బిడ్లను దాఖలు చేయలేదు.

● దీనిపై మత్స్యశాఖ జిల్లా అధికారి సురేశ్ మాట్లాడుతూ.. ఇతర జిల్లాల్లో కేటాయింపు పూర్తయిన తరువాత టెండరుదారుల్లో మిగిలినవారికి జిల్లాలో చేపపిల్లల సరఫరా బాధ్యతలను అప్పగిస్తామన్నారు. ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆలస్యమైతే ఉత్పత్తిపై ప్రభావం

జిల్లాలో నిరుడు ఆలస్యంగా, లక్ష్యంలో మూడోవంతు చేపపిల్లలనే వదలడంతో ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. 9 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా.. కేవలం 4 వేల మెట్రిక్ టన్నులకే పరిమితమైంది. స్థానికంగా చేపలు లభించక, ఇతర ప్రాంతాలనుంచి తేవటంతో గిట్టుబాటు గాక మత్స్యకారులు నష్టపోయారు. సెప్టెంబరు, అక్టోబరులో వర్షాలు ముగిసేలోపు చేపపిల్లలను చెరువుల్లో వదిలితే అవి కొత్త నీటికి, బురద నీటికి త్వరితంగా అలవాటు పడతాయి. వానాకాలంలో పెరిగే చిన్నచిన్న కీటకాలను, కొన్నిరకాల మొక్కలను తింటూ పెరుగుతాయి. ఆలస్యంగా వదిలితే చల్లటి నీటిలో ఎదగక, ఆహారం దొరకక, కొత్త నీటికి అలవాటు పడక చాలావరకు చనిపోతాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రహు, మ్రిగాల, కట్ల, బంగారు తీగ రకాలను సరఫరా చేయనుండగా తగిన సైజున్నవి సకాలంలో వదలాలని కోరుతున్నారు.

16 వాహనాలు స్వాధీనం

జగిత్యాల, న్యూస్‌టుడే: పట్టణంలో సోమవారం రవాణాశాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆర్టీవో మహ్మద్ సందాని ఆధ్వర్యంలో పన్నులు చెల్లించని, సరైన పత్రాలు లేని 16 వాహనాలను స్వాధీనపర్చుకున్నారు. ఏఎంవీఐలు రామారావు, సాయిచరణ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
లీజుపై ఆవరణ కావలెను
NIT NO: AONIZ/RBO/GODA/2026-27/9
AO నిజామాబాద్ RBO గోదావరిఖని పరిధిలో SBI AMCC జగిత్యాల శాఖ (62520) కొరకు లీజుపై ఆవరణ కావలెను
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు SBI తరపున RBO గోదావరిఖని పరిధిలో, SBI AMCC జగిత్యాల శాఖ (62520) కొరకు లీజుపై ఆవరణ కొరకు లీజు/అద్దె ప్రాతిపదికపై సుమారు 222.97 చ.మీటర్ల (2400 చ.అడుగుల) కార్పెట్ ఏరియా గల కమర్షియల్/ఆఫీస్ ఆవరణ గల యజమానులు/ పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్స్ నుండి ఆఫర్లు కోరుచున్నారు. ఆవరణ తగినంత పవర్‌లోడ్, నీటి సరఫరా, పార్కింగ్ స్థలం, జనరేటర్ ఉంచడానికి స్థలం, ఇ-లాబీ మరియు వి-శాట్, తగిన ముందుభాగంతో పాటు అన్ని వసతులను కలిగి ఉండవలెను. పూర్తి స్థలం ప్రధానంగా గ్రౌండ్‌ఫ్లోర్‌పై ఒక సింగిల్ ఫ్లోర్‌లో ఉండవలెను. ఆవరణ లేదా ప్లాట్ స్వాధీనతకు/అనుభవానికి సిద్ధంగా ఉండవలెను. వివరమైన నియతాంశాలు, నియమ నిబంధనలు కలిగిన టెక్నికల్ బిడ్ మరియు ప్రైస్ బిడ్ దాఖలుకు ఫార్మెట్‌ను SBI వెబ్‌సైట్ www.sbi.co.in లేదా www.bank.sbi లేదా https://sbi.bank.in/ లో "SBI in the News" క్రింద "Procurement News" లింక్ (https://sbi.bank.in/web/sbi-in-the-news/procurement-news)లో 01.09/2026 నుండి 21/09/2026 వరకు డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును మరియు తగు విధంగా పూర్తిచేసి దాఖలు చేయవచ్చును. ప్రభుత్వ శాఖలు/ ప్రభుత్వరంగ యూనిట్లు/ బ్యాంకులకు స్వంతమైన ఆవరణలకు ప్రాధాన్యత ఇవ్వబడును. అన్నివిధాలా పూర్తిచేసి, సీల్డ్ కవర్లలో ఆఫర్లను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజినల్ బిజినెస్ ఆఫీస్, RBO-II, గోదావరిఖని, తిరుమల కాంప్లెక్స్, NTPC, కృష్ణానగర్, గోదావరిఖని, పెద్దపల్లి జిల్లా-505215 వారికి 21/09/2026 మ. 03.00 గం.లోగా దాఖలు చేయవలెను. ఏ కారణం తెలుపకనే ఏదేని లేదా అన్ని ఆఫర్లను అంగీకరించు లేదా తిరస్కరించు హక్కు SBIకి కలదు. బ్రోకర్లు అనుమతించబడరు.
తేది: 31.08.2026 సం/-, ది రీజినల్ మేనేజర్
రీజినల్ బిజినెస్ ఆఫీస్-II, గోదావరిఖని, AO, నిజామాబాద్
ఇమెయిల్: agmr2.aoniz@sbi.co.in
ఫోన్: +91 9951784387

ఎత్తిపోతలే ఆధారం.. అన్నదాతలపైనే భారం

ప్రతిపాదనల్లోనే ప్రభుత్వ నిర్వహణ బాధ్యత

న్యూస్‌టుడే, ధర్మపురి

గోదావరి ఎత్తిపోతల పథకాలు ధర్మపురి మండలంలో సాగుకు ఆధారంగా మారాయి. అయితే వీటి నిర్వహణ మాత్రం రైతులకు భారంగా మారింది. ధర్మపురి మండలం రాయపట్నం, తిమ్మాపూర్, దమ్మన్నపేట, రాజారం, జైన, దొంతాపూర్, ఆరెపల్లిలో ఎత్తిపోతల పథకాలున్నాయి. వీటి కింది పది వేల ఎకరాల ఆయకట్టు ఉంది. గత వేసవిలో రాయపట్నం, తిమ్మాపూర్, దమ్మన్నపేట, జైన ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన విద్యుత్తు నియంత్రికల్లో రాగి తీగ చోరీకి గురి కాగా.. రైతులే స్వయంగా డబ్బులు పోగు చేసుకుని యాసంగి పంటకు కిరాయి మోటార్లను తెప్పించుకొని సాగు పనులు చేసుకున్నారు. అనంతరం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

ఏటా రూ.3 లక్షల ఖర్చు

ఏటా ప్రతి రైతు చందాలు వేసుకుని ఎత్తిపోతల నిర్వహణ చేపడుతున్నారు. ముగ్గురు కార్మికులకు వేతనాలు, పరికరాల కొనుగోలుతో ఎప్పటికప్పుడు పంపులను నడిపిస్తుండటంతో రైతుల పొలాలు కళకళలాడుతున్నాయి. గత ఏడాది సాగు నీటిశాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డికి కొందరు ప్రజాప్రతినిధులు సూచించిన మేరకు ఈ ఎత్తిపోతల పథకాల నిర్వహణ ప్రభుత్వమే చూసుకుంటుందని హామీ ఇచ్చారు. ఏడాది గడుస్తున్నా.. అది అమలుకు నోచలేదు. దీంతో ఏటా సుమారు రూ.3 లక్షల వరకు రైతులపై భారం పడుతోంది. పూర్తి స్థాయిలో ప్రభుత్వమే నిర్వహణ బాధ్యతలను తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

పథకం	మోటార్లు	పనిచేస్తున్నవి	పనిచేయనివి
జైన	3	1	2
దమ్మన్నపేట	3	3	-
రాయపట్నం	3	2	1
తిమ్మాపూర్	4	3	1
దొంతాపూర్	5	3	2
ఆరెపల్లి	3	-	3

రాయపట్నం గోదావరి ఎత్తిపోతల పథకం

ప్రభుత్వమే నిర్వహణ బాధ్యత చేపట్టాలి

ఎత్తిపోతల పథకం కిందనే రాయపట్నంలో మొత్తం పంటలు సాగు చేస్తున్నాం. ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగు నీరందడం లేదు. గోదావరి లిఫ్టులతోనే మొత్తం పంట పొలాలు సాగవుతున్నాయి. అయితే ఈ నిర్వహణ భారం మాత్రం రైతులపై ఉంటోంది. ప్రభుత్వమే నిర్వహణ బాధ్యత చేపట్టాలి.

వెంకటేశ్వర్లు, రైతు రాయపట్నం

దెబ్బతిన్న కల్వర్టులు.. గుంతలతో ఇబ్బందులు

ధర్మపురి మండలం నక్కలపేట-తుమ్మెనాల ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. గుంతలు పడి నడవడానికి వీలు లేకుండా ఉంది. బీర్‌పూర్ మండలంలోని పది గ్రామాల ప్రజలు నక్కలపేట, తుమ్మెనాల మీదుగా జగిత్యాలకు వెళ్తుంటారు. ఈ రోడ్డు నిర్మాణానికి పుష్కరాల ప్యాకేజీలో పనుల్లో చేర్చేందుకు సమ్మతించారు. పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ధర్మపురి**

నమూనా ప్రకటన
బహిరంగ ప్రకటన
ఇందుమూలంగా అందరికీ తెలియజేయునది ఏమనగా నా క్లయింటుయగు శ్రీ .... వారికి చెందినటువంటి గృహము ఇంటి నెం. మరియు ఖాళీ జాగా, ఈ క్రింది హద్దులు గల ఉత్తరం : ఇతరుల ఖాళీ జాగా, దక్షిణం : 20 ఫీట్ల రోడ్డు, తూర్పు: ఇతరుల ఖాళీ జాగా, పడమట: .... గారి ఇల్లు, పట్టణంలో గల దానిని కొనడానికి అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. మరియు అడ్వాన్సు కూడా ఇచ్చియున్నారు. ఇట్టి విషయంగా ఎవరికైనా అక్షేపణలు ఉన్న ఎడల వారం రోజులలోగా సాక్ష్యములతో సహా నన్ను సంప్రదించగలరు. ఆ తరువాత వచ్చే ఎటువంటి క్లయిమ్‌లు నా క్లయింటును బైండ్ చేయజాలవు.
సం/-
విజ్ఞతగల నిర్ణయం. వివాదాలకు అతీతం.

25% డిస్కౌంట్ కలదు
లక్షల విలువైన స్థిరాస్తిని కొనేముందు సరైన నిర్ణయం తీసుకోవడం అవసరం. 'ఈనాడు'లో బహిరంగ ప్రకటన ఇవ్వడం ఎంతో సులభం.
GST 5% Applicable
వివరాలకు సంప్రదించండి :
Cell: 80087 09949
జగిత్యాల: 80087 09954

(c) eenadu

చీడపీడలు.. యాజమాన్య పద్ధతులు

న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

ప్రధాన పంట మామిడిలో ఇటీవల చీడపీడలు పెరగటం, కాతతగ్గటం వంటి పలు సమస్యలు తలెత్తుతున్నాయి. కేవలం కాత సమయంలోనే కాకుండా కాయలు తెంపిన తర్వాత నుంచి మామిడి తోటల్లో తగిన యాజమాన్య పద్ధతులు చేపడితేనే తదుపరి సీజన్‌లో అధిక, నాణ్యమైన కాత చేతికివస్తుందని ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ కె.స్వాతి సూచిస్తున్నారు.

రైతేరాజు

మామిడిచెట్లు

☛ ఒక కిలో మైలుతుత్తం, ఒక కిలో పొడిసున్నాన్ని 100 లీటర్ల నీటికి కలిపి తయారుచేస్తే 1 శాతం బోర్డోమిశ్రమం తయారవుతుంది. కొమ్మలు తొలగించిన తరువాత తెగుళ్ల సోకకుండా ఉండేందుకు ఈ మిశ్రమాన్ని చెట్లపై పిచికారీ చేయాలి, లేదా కొమ్మ కత్తిరించిన భాగాలపై బోర్డోపేస్టును పూయాలి. బోర్డో మిశ్రమాన్ని ఎప్పటికప్పుడు తయారు చేసుకోవచ్చు.

☛ మామిడి కాయలు తెంపిన తరువాత చెట్లపై ఎండిన, అడ్డదిడ్డంగా పెరిగిన, చీడపీడలు ఆశించిన కొమ్మలను, ఆకులను తీసివేయటం ద్వారా చెట్టు లోపలి భాగాలకు గాలి, వెలుతురు బాగా అంది చీడపీడల బెడద తగ్గుతుంది. తోటలో రాలి, కుళ్లిపోయిన కాయలు, చెత్తాచెదారాన్ని తీసివేయాలి.

☛ వర్షాలు లేదా నీటితడితో నేల తడిగా మారిన తరువాత పశువుల ఎరువు లేదా వర్మీకంపోస్టును మొక్కల మొదళ్ల చుట్టూ వేసి చెట్లమధ్యన దున్నాలి. చిన్నచెట్లు గల తోటల్లో పెసర, మినుము, అలసంద, వేరుసెనగ, అల్లం, కూరగాయలు తదితర అంతర పంటలు లేదా జనుము, జీలుగ, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట పైర్లను సాగుచేయవచ్చు.

☛ తొలిదశలో చెట్టుకు 750 గ్రాముల యూరియా, 2 కిలోల ఫాస్పరస్, అరకిలో పొటాష్‌ను వేయాలి. ఆగస్టు నుంచి చెట్టు చిగురించే దశలో 100 గ్రాముల జింకు, 50 గ్రాముల బోరాన్ చొప్పున ఒక్కో చెట్టుకు వేయాలి. సెప్టెంబరులో 5 శాతం జింకుసల్ఫేట్, 2 గ్రాముల చొప్పున మెగ్నీషియం, మాంగనీస్, ఫెర్రస్, బోరాక్స్, 6 శాతం రాళ్లసున్నం, 10 గ్రాముల యూరియాను సాండోవిట్‌తో కలిపి పిచికారీ చేయవచ్చు. లేతాకుల దశలో ఆకుగూడు పురుగు నివారణకు వేపనూనె పిచికారీ చేయాలి. తీవ్రత అధికంగా ఉన్నప్పుడు లీటరు నీటికి 2 మి.లీ క్లోరోఫైరిఫాస్‌ను కలిపి పిచికారీ చేయాలి.

☛ తేనెమంచు పురుగు నిరోధానికి సెప్టెంబరు తరువాత లీటరు నీటికి 2 మి.లీ.ల క్లోరోఫైరిఫాస్ వంతున కలిపి చెట్లపై పిచికారీ చేయాలి. చెట్ల వయసును బట్టి పదేళ్ల వయసుగల చెట్టుకు 2.2 కిలోల యూరియా, 6 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 1.6 కిలోల పొటాష్ ఎరువులను వేయాలి. అక్టోబరు తొలివారంలో పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు లీటరు నీటికి కలిపి చల్లాలి. డిసెంబరు మొదటి పక్షంలో తేలికపాటి నీటితడిని ఇవ్వాలి. బిందుసేద్యం గల రైతులు రసాయన ఎరువులను బిందుసేద్య పరికరాల ద్వారా(ఫర్టిగేషన్) అందించవచ్చు. ఇందుకు నీటిలో కరిగే రసాయన ఎరువులను వాడాలి.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

సాగులో రైతుల సందేహాలను జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త **జి.వేణుగోపాల్** నివృత్తి చేశారు.

? బంతిలో మొగ్గ తెగులు నివారణకు ఏం చేయాలి. – **మనోహర్‌రెడ్డి, మాచనపల్లి**

✓ కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి మొగ్గలు విచ్చుకోకముందే పిచికారీ చేయాలి.

? పొద చిక్కుడులో పురుగు నివారణ ఎలా. – **శ్రీహరి, బేతిగల్**

✓ పురుగు ఉద్ధృతిని బట్టి ఎకరానికి 200 లీటర్ల నీటిలో ఫ్లూబెండమైడ్ 60 మి.లీ కలిపి పిచికారీ చేయాలి.

? పాలకూర ఆకులు ముడతలు వస్తే ఏం చేయాలి. – **వెంకన్న, సైదాబాద్**

✓ 3 గ్రాముల పోషకాలను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

? లిల్లీ పూలను రసం పీల్చే పురుగులు ఆశిస్తున్నాయి. –**రజనీకాంత్, వెల్లంపల్లి**

✓ నివారణకు లీటరు నీటికి డైమిథోయేట్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

? వంగ తోటలో నల్లి ఎక్కువగా కనిపిస్తోంది. – **రాజేశ్వర్‌రావు, శ్రీరాములపేట**

✓ నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

- న్యూస్‌టుడే, జమ్మికుంట

పశు పోషణతో లాభాల పంట

పశువుల పాకలో గేదెలు

సతీశ్‌కుమార్

ఆదర్శం

పశుపోషణతో లాభాలు ఆర్జిస్తున్నారు పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం సిద్దపల్లె గ్రామానికి చెందిన జాబు సతీశ్‌కుమార్. వివరాలు ఆయన మాటల్లోనే.. నాకున్న అయిదున్నర ఎకరాల భూమిలో 5 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నా. ఇంటి సమీపంలోని 30 గుంటల భూమిలో 5 గుంటల్లో పశువుల కోసం ప్రత్యేకంగా షెడ్డు వేసి ముర్రా, ఒంగోలు జాతికి చెందిన గేదెలను తెచ్చా. 10 గుంటల్లో ఏపీపీఎన్, సుపిరియర్‌పిన్నియా జాతి గడ్డిని పెంచుతున్నా. నిత్యం ఉదయం 40-50 లీటర్ల పాలను యైటింక్లయిన్‌కాలనీ, మహాకవిపోతన కాలనీ ఏరియాలోని సింగరేణి కుటుంబాలకు లీటరు రూ.80 చొప్పున విక్రయిస్తున్నా. ఒక్కో గేదె 8-10 లీటర్ల పాలు ఇస్తుంది. ఎదకు వచ్చేంత వరకు పాలిస్తాయి. మొదటి ఆరు మాసాలు 11, మరో ఆరు మాసాలు 8 గేదెలు పాలు ఇస్తుంటాయి. దూడల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించడంతో కొత్తవి కొనుగోలు చేయాల్సిన అవసరం రాదు. పచ్చి, ఎండుగడ్డితో పాటు పెసరపొట్టు, గోధుమపరం, పల్లిపిండి, బెల్లం దాణాగా వేస్తుంటా. 15 రోజులకు ఒకసారి పశువైద్యుడితో వైద్యపరీక్షలు చేయిస్తా. మొత్తం నెలకు ఖర్చు రూ.30 వేల వరకు వస్తుండగా దాదాపు రూ.80 వేల ఆదాయం వస్తోంది.

- న్యూస్‌టుడే, యైటింక్లయిన్‌కాలనీ

రసాయనాలు లేకుండా కూరగాయల సాగు

మీకు తెలుసా?

కూరగాయలను పండించదలిస్తే దుక్కిలోనే పశువులు, కోళ్ల, జీవాల ఎరువు లేదా వర్మీకంపోస్టును వేసి కలియదున్నాలి. వేపపిండి, వేరుసెనగపిండి, ఆముదపుపిండి తదితరాలు వాడొచ్చు. పంటమార్పిడి పాటించాలి. వ్యవసాయ వ్యర్థాలను కాల్చివేయకుండా నేలలోనే కలియదున్నాలి. జీవన ఎరువులైన అజటోబాక్టర్, అజోస్పైరిల్లం, ఫాస్ఫోబ్యాక్టీరియాను వినియోగించవచ్చు. రసాయనాలు వాడకుండా సహజ సస్యరక్షణ యాజమాన్యం, జీవ నియంత్రణ పద్ధతులు పాటించాలి. అవసరముంటే వేపనూనెను పిచికారీ చేయాలి. సేంద్రియ పద్ధతులవల్ల పంటనాణ్యత పెరిగి మన ఆరోగ్యం బాగుంటుంది.

- న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

పర్యావరణ హితుడు.. మట్టి గణపతి

న్యూస్‌టుడే, ఫెర్టిలైజర్ సిటీ

గణపతి నవరాత్రి ఉత్సవాలు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. వాడవాడలా విగ్రహాలు నెలకొల్పేందుకు ఉత్సవ కమిటీలు సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే విగ్రహాల తయారీ కేంద్రాల్లో ముందస్తు బుకింగ్‌లు చేసుకొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో అయిదు వేలకు పైగా వినాయక మండపాలు ఏర్పాటు చేస్తుండగా మట్టి ప్రతిమలను ఏర్పాటు చేసేవి వంద లోపే ఉండటం గమనార్హం. ఇళ్లల్లో మాత్రం ఎక్కువగా మట్టి ప్రతిమల ఏర్పాటుకు ప్రాధాన్యమిస్తుంటారు. స్వచ్ఛంద సంస్థలు మట్టి విగ్రహాలతో కలిగే ప్రయోజనాలు, పీవోపీ(ప్లాస్టర్ ఆఫ్ పారీస్) విగ్రహాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ ఎక్కువ మంది తక్కువ ధరకు వస్తుందనే కోణంలో ఎక్కువగా పీవోపీ వైపే మొగ్గు చూపుతున్నారు.

ఆర్భాటాలకే అధిక ప్రాధాన్యం

సెప్టెంబరు 14 నుంచి వినాయక నవరాత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. పూజకు వినియోగించే వివిధ రకాల పత్రాలతో పాటు ప్రతిమల్లోనూ పర్యావరణ హితం, ఆరోగ్య పరిరక్షణ ఉంటుంది. భక్తితో చేసే పూజల కంటే ఆర్భాటాలకే అధిక ప్రాధాన్యతనిస్తూ ఎత్తయిన పీవోపీ విగ్రహాలను ఏర్పాటు చేస్తుంటారు. ఈ విగ్రహాలను నదులు, చెరువుల్లో నిమజ్జనం చేస్తే సులువుగా కరగకపోవడంతో పాటు జలచరాలకు నష్టం చేకూరుస్తాయి. మట్టి విగ్రహాలు నిమజ్జనం చేసిన కొంత సమయానికే కరిగిపోతాయి. ఎలాంటి కాలుష్యం ఉండదు. గణపతి మండపాల నిర్వాహకులు, భక్తులు, పర్యావరణహితం కోరే వారు స్పందిస్తేనే ప్రయోజనం చేకూరే అవకాశం ఉంటుంది.

స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు

ఉమ్మడి జిల్లాలో కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా మట్టి ప్రతిమలను పంపిణీ చేయడంతో పాటు ఎత్తయిన విగ్రహాలను నెలకొల్పుతుంటారు. పెద్దపల్లిలోని ఛత్రపతి యువసేన ఆధ్వర్యంలో మూడు దశాబ్దాలుగా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేస్తుండగా ఎనిమిదేళ్లుగా 63 అడుగుల మట్టి విగ్రహాన్ని నెలకొల్పుతున్నారు. అగ్నిమాపక యంత్రం ద్వారా నెలకొల్పిన ప్రదేశంలోనే నిమజ్జనం చేస్తుంటారు. మట్టి విగ్రహాల తయారీలో మట్టి, కొబ్బరిపీచు, వెదురు, జనుము మాత్రమే వినియోగించడంతో పర్యావరణానికి ఎలాంటి నష్టం ఉండదు. రామగుండం నగరపాలక ప్రాంతంలో తెలంగాణ మహిళా మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రెండు దశాబ్దాలుగా మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. మట్టి ప్రతిమలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి ప్రతిమలనే పూజించాలంటూ సదస్సులు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

పెద్దపల్లిలో సిద్ధమవుతున్న 63 అడుగుల మట్టిప్రతిమ

మంచిర్యాలలో కేంద్రీకృత వంటశాల

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే : తెలంగాణ స్కూల్ బ్రేక్ ఫాస్ట్ ప్రోగ్రాంలో భాగంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం కేంద్రీకృత వంటశాలను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రారంభించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్, సింగరేణి సంస్థ భాగస్వామ్యంతో ఏర్పాటైన వంటశాలలో మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలోని 691 ప్రభుత్వ పాఠశాలలు, 13 జూనియర్ కళాశాలలకు చెందిన 49,109 మంది విద్యార్థులకు రోజూ రుచికరమైన, పరిశుభ్రమైన అల్పాహారం ఆరంభమైంది. ఈ తయారీ విధానాన్ని ఎమ్మెల్యేతో పాటు జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, సింగరేణి అధికారులు పర్యవేక్షించారు. డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ చంద్రయ్య, సింగరేణి అధికారులు రాధాకృష్ణ, ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ప్రతినిధులు సత్య గౌరచంద్ర దాస పాల్గొన్నారు.

వర్షం నమోదు తెలుసుకోండిలా..

న్యూస్‌టుడే, పాలకుర్తి

మీకోసం

వర్షాకాలంలో ఏ ప్రాంతంలో ఎంత వర్షపాతం కురిసిందో తెలుసుకోవాలంటే వెబ్‌సైట్ అందుబాటులో ఉందనే విషయం చాలా మందికి తెలియదు. హెచ్‌టీటీపీఎస్://టీఎస్‌డీపీఎస్.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వాతావరణ వివరాలు, ఏ జిల్లాలో, ఏ మండలంలో ఎంత వర్షపాతం నమోదైందో తెలుసుకోవచ్చు.

వర్షం రకాలు (మి.మీ.లలో)

0.0-0.2 : వర్షం లేదు
0.3-2.4 : చాలా తేలికపాటి
2.5-15.5 : తేలికపాటి
15.6-64.4 : సాధారణ
64.5-115.5 : భారీ
115.6-204.4 : అతి భారీ

వర్షపాతాన్ని సేకరించే విధానం

సాధారణంగా ఉదయం 8.30 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8.30 గంటల వరకు(24 గంటల వ్యవధిలో) కురిసిన వర్షాన్ని సేకరించి ఆ రోజు వర్షపాతంగా నమోదు చేస్తారు.

◆ 204.5 మి.మీ.లు లేదా అంతకు మించి కురిసిన వర్షాన్ని అత్యంత భారీ వర్షంగా పరిగణిస్తారు.

◆ ఒక మిల్లీ మీటరు వర్షపాతం అంటే: ఒక చదరపు మీటరు నేలపై ఒక లీటరు నీరు నిలిచిందని అర్థం.

త్వరలోనే ఎథిక్స్ కమిటీ అంశంపై స్పందిస్తా : కౌశిక్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: తాను భారాస బీ ఫారం మీద గెలిచి ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నానని.. అమ్ముడుపోలేదని. దీనిపై అసెంబ్లీ ఎథిక్స్ కమిటీయే ఆలోచన చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. హుజూరాబాద్ మున్సిపల్ పరిధి కేసీ క్యాంపులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారాస తరఫున గెలిచిన వ్యక్తి.. కాంగ్రెస్ కండువా కప్పుకొని తిరుగుతుండటంతో ఏ పార్టీ నుంచి మాట్లాడుతున్నావో అడగటం తప్పా అని ప్రశ్నించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటికీ.. ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న వారికి విలువలు ఉన్నట్టా, అమ్ముడుపోయిన వ్యక్తికి ఉన్నట్టా అని ఎద్దేవా చేశారు. త్వరలోనే ఎథిక్స్ కమిటీ అంశంపై స్పందిస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టేందుకు భారాస ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు హుజూరాబాద్ నియోజకవర్గవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 2న ఉదయం 10 గంటలకు హుజూరాబాద్ అంబేడ్కర్ కూడలి వద్ద 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. 3న వీణవంకలో రైతులతో ధర్నా, 4న కమలాపూర్‌లో మహిళలు, విద్యార్థినులతో కలిసి వంటావార్పు, 5న జమ్మికుంటలో విద్యార్థులు, నిరుద్యోగ యువకులతో ర్యాలీ, 6న హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట మండల కేంద్రాల్లో ఆటో కార్మికులతో నిరసన, 7న అన్ని మండల కేంద్రాల్లోని ప్రజావాణిలో వేలాది మందితో వినతిపత్రాల అందజేత, 8న జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ శ్రీనివాస్, రమేష్, సురేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, గందె శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

విద్యుత్తు అమరవీరుల స్తూపం ప్రారంభం

విద్యుత్తు అమరవీరుల స్మారక స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

భగత్‌నగర్, న్యూస్‌టుడే: కరీంనగర్‌లోని విద్యుత్తు సంస్థ సర్కిల్ ఆవరణలో నిర్మించిన విద్యుత్తు అమరవీరుల స్మారక స్తూపాన్ని ఆ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సోమవారం రాత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సంస్థలో రక్షణ ప్రమాణాల పాధాన్యత, అమరుల త్యాగాలను గుర్తుచేశారు. ప్రజలకు నిరంతరం విద్యుత్తు సేవలు అందించేందుకు ప్రాణాలనుపణంగా పెట్టిన వారి త్యాగాలు స్మరించదగ్గవన్నారు. జీరో యాక్సిడెంట్ లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రతి ఉద్యోగికి నాణ్యమైన భద్రతా పరికరాలు, అవసరమైన శిక్షణ అందిస్తున్నామన్నారు. ఎంత అనుభవం ఉన్నా సేఫ్టీ ప్రొటోకాల్స్, ఎర్తింగ్ విధానాలను తప్పక పాటించాలన్నారు. అనంతరం సీతారాంపూర్‌లోని ఓ వేడుకల మందిరంలో జరిగిన ఎస్‌ఈ రాపెల్లి రవీందర్ పదవీ విరమణ ఉత్సవంలో పాల్గొన్నారు.

వరి పొలంలో పడి రైతు మృతి

నర్సయ్య

గంగాధర, న్యూస్‌టుడే: కాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సరిపల్లి నర్సయ్య(60) అనే రైతు సోమవారం వరిపొలంలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు వరి చేను వద్ద కట్టేసి ఉంచిన దూడను ఇంటికి తీసుకురావడానికి వెళ్లే సమయంలో కాలుజారి ప్రమాదవశాత్తు వరి బురద పొలంలో పడిపోయారు. ముక్కు మూసుకుపడిపోవడంతో శ్వాస రాక అక్కడికక్కడే మృతి చెందారు. కొద్దిసేపటి తర్వాత అటువైపు వెళ్లిన రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా అప్పటికే విగత జీవిగా ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

EENADU e Classifieds

REAL ESTATE

LAND FOR SALE

16 Guntas Land Karimnagar Hyd. Highway Road. R.K.Colony with House and Borewell. Contact: 9848043704, 7780646886.

JOBS

ప్రముఖ సోలార్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. నెలకు 20వేలు + ఇన్సెంటివ్స్. మీ మండలాలలో పట్టణాలలో ఉండి పనిచేయాలి. Ph: 7075019021

రాఘవ అసెట్ ఫైనాన్స్‌లో బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ GDK-4, PDPL-4, KNR-5, HZB-2, JGL-4, SRCL-4, మంథని-4 కావలెను. సెల్: 91009 02181, 82

FACULTY/ TEACHERS

Wanted: Full Time High School Social Teacher at Veenadhari H/S. CPD, KNR. 94944 99771. Salary: 30k to 50k

Wanted Teachers to teach Primary Hindi Contact: Siddhartha High School, Varahaswamy Temple, Bommakal Road, Karimnagar. Cell: 95026 51843, 98662 35525.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book Your 5 Lines Classified Advertisement for
B & W Rs.490/- Only
Colour Rs. 575/- Only
GST 5% Applicable in Classifieds on any day
For further details Contact:
80087 09949
80087 09950
80087 09954

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80087 09949
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14779

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే : బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధికా జైశ్వాల్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ మహేష్ బి.గితె తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. 2021లో తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ మైనర్ బాలికను జనగాంకు చెందిన యటెల్లి విజయ్ అనే వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడగా, బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై లక్ష్మారెడ్డి కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయగా, కోర్టు మానిటరింగ్ ఎస్సైలు రవీందర్‌నాయుడు, శ్రవణ్ యాదవ్ ఆధ్వర్యంలో 18 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. పీపీ ఝాన్సీ వాదించగా, కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు తెలిపారు. నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన డీఎస్పీ నాగేంద్రచారి, తంగళ్లపల్లి ఎస్సై అశోక్, కోర్టు కానిస్టేబుళ్లు రాజేందర్, నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల, భరోసా సెంటర్ సభ్యులు లహరికను ఎస్పీ అభినందించారు. మహిళల భద్రతకు పోలీస్ శాఖ ప్రాధాన్యం ఇస్తోందని, ఎవరైనా వేధింపులకు గురైతే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

భార్యపై హత్యాయత్నం కేసులో భర్తకు రెండేళ్లు..

గోదావరిఖని, న్యూస్‌టుడే: భార్యపై కత్తెరతో హత్యాయత్నానికి పాల్పడ్డ భర్తకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ గోదావరిఖని జడ్జి జీవన్ సూరజ్ సింగ్ సోమవారం తీర్పు ఇచ్చారు. గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . స్థానిక విఠల్‌నగర్‌కు చెందిన పర్లపల్లి సంపత్(43) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో డబ్బుల కోసం భార్య స్వప్నపై గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. తర్వాత పెద్దల సమక్షంలో మరోసారి తప్పు చేయనని క్షమాపణ చెప్పి భార్యను కాపురానికి తీసుకెళ్లాడు. అయినప్పటికీ అతనిలో మార్పు రాలేదు. భార్య తన వద్ద దాచుకున్న రూ.వెయ్యి ఇవ్వడం లేదన్న కోపంతో కత్తెరతో మెడ, పక్కటెముకలపై విచక్షణారహితంగా గాయపరిచాడు. స్వప్న తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఒకటో పట్టణ పోలీసులు సంపత్‌ను కోర్టులో హాజరుపరిచారు. అనంతరం ఛార్జీషీటు దాఖలు చేశారు. ఈమేరకు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నిందితునికి రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.పదివేల జరిమానా విధించినట్లు సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. కోర్టు కానిస్టేబుళ్లు సతీష్‌కుమార్, కె.శంకర్‌ను డీసీపీ రాంరెడ్డి, ఏసీపీ రమేశ్‌ను సీపీ అభినందించారు.

క్షుద్ర పూజల పేరుతో టోకరా

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేష్ బి.గితె

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే : క్షుద్ర పూజలు, మంత్రాలు, చేతబడుల పేరుతో అమాయక ప్రజలను నమ్మించి భారీగా డబ్బులు వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను సిరిసిల్ల పోలీసులు అరెస్ట్ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళను టార్గెట్ చేసి క్షుద్ర పూజలతో నయం చేస్తామని చెప్పి ఆమె నుంచి రూ.62 లక్షలు దండుకొని చివరికి పోలీసుల చేతికి చిక్కారు. సిరిసిల్ల ఠాణాలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మహేష్ బి.గితె వివరాలను వెల్లడించారు. ఆయన వివరాల ప్రకారం.. కరీంనగర్ మంకమ్మతోటకు చెందిన శ్యాంకుమార్ ప్రస్తుతం హైదరాబాద్‌లో పూజా సామగ్రి దుకాణం నిర్వహిస్తున్నాడు. వేములవాడ మండలం అగ్రహారం గ్రామానికి చెందిన పి.లక్ష్మీరాజంతో అతడికి పరిచయం ఉంది. ఇద్దరూ కలిసి క్షుద్రపూజలు, మంత్రాల పేరిట మోసం చేయాలని పథకం పన్నారు. ఉప్పల్‌కు చెందిన లత అనే మహిళ శ్యాంకుమార్‌ను కలిసి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నానని చెప్పింది. ఇదే అదనుగా తీసుకున్న శ్యాంకుమార్ క్షుద్రపూజలతో దీర్ఘకాలిక వ్యాధులను లక్ష్మీరాజం అనే వ్యక్తి నయం చేస్తాడని చెప్పి ఆమెను సిరిసిల్ల తీసుకొచ్చాడు. పూజా సామగ్రి కోసం రూ.10 లక్షలు, యాదాద్రి వద్ద పూజ కోసం రూ.21 లక్షలు, కాశీలో పూజ పేరిట రూ.13 లక్షలు, విడతల వారీగా మొత్తం రూ.62 లక్షలు వసూలు చేశారు. ఎన్ని రోజులైనా అనారోగ్యం నయం కాకపోవడంతో తానిచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా సదరు నిందితులు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ నెల 23న డబ్బులు తిరిగిస్తాం. . సిరిసిల్లకు రమ్మని చెప్పి.. ఎంతకూ కలవకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి అగ్రహారంలోని లక్ష్మీరాజం ఇంటి వద్ద ఇద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.30.50 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, రెండు బెల్లం బొమ్మలు, తదితర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, ఎస్సై గణేష్ ఉన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

● ఫైనాన్సు ఒత్తిళ్లే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ

మహేశ్

ధర్మపురి, న్యూస్‌టుడే: ముదిరాజ్‌కాలనీలో సోమవారం సాయంత్రం పంబాల మహేశ్(29) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ధర్మపురి ఎస్సై నాగపురి సదాకర్ తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మహేశ్ 2022లో ఇంటి నిర్మాణం కోసం ఓ ఫైనాన్సు నుంచి రూ.10 లక్షల వరకు రుణం తీసుకుని ఈఎంఐల ద్వారా చెల్లిస్తున్నారు. అనారోగ్య కారణాలు, ఆర్థిక ఇబ్బందులతో ఈఎంఐలు చెల్లించడం ఆపేశారు. దీంతో నెల క్రితం సంబంధిత ఫైనాన్సు నిర్వాహకులు ఇంటికి వచ్చి మిగతా డబ్బు చెల్లించకుంటే ఇంటిని జప్తు చేసి వేలం వేస్తామని హెచ్చరించి ఒత్తిడికి గురి చేసినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం ఇంటికి వచ్చిన ఫైనాన్సు నిర్వాహకులు గోడపై 'ఈ ప్రాపర్టీ ఫైనాన్సు తనఖాలో ఉందని' రాసి మరోమారు హెచ్చరించారు. దీంతో మనస్తాపం చెందిన మహేశ్ ఒంటరిగా ఉన్న సమయంలో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, ఫైనాన్సు వారి ఒత్తిడి, ఇంటిని వేలం వేస్తామని భయపెట్టిన కారణంగా అవమానానికి లోనై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపించారు.

కేజీబీవీ విద్యార్థిని ప్రేమ వివాహం

ముత్తారం, న్యూస్‌టుడే: కేజీబీవీ విద్యార్థిని ప్రేమ వివాహం చేసుకొన్న సంఘటన పెద్దపల్లి జిల్లాలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలానికి చెందిన ఓ విద్యార్థిని ముత్తారం మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇంటర్ చదువుతోంది. విద్యార్థిని ఆగస్టు 23న కడుపులో నొప్పి ఉందని చెప్పడంతో సిబ్బంది ఆమె తల్లికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తర్వాత తన పెద్దమ్మ వస్తుంది అని చెప్పగా ఓ మహిళ రాగా సిబ్బంది పంపించారు. విద్యార్థిని తీసుకెళ్లే సమయంలో రిజిస్టర్‌లో ఆమె ఫోన్ నంబరు నమోదు చేశారు. కుమార్తెను చూసేందుకు సోమవారం తల్లి రాగా సిబ్బంది 23న పంపించినట్లు తెలిపారు. తమ వాళ్ల ఎవరూ రాలేదని సిబ్బందికి తెలుపగా వారు రిజిస్టర్‌లో నమోదైన నంబర్‌కు ఫోన్ చేయగా తాను ప్రేమించిన యువకుడిని ప్రేమ వివాహం చేసుకొన్నట్లు విద్యార్థిని తెలిపింది. దీంతో సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. తర్వాత పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. మరోసారి పోలీసులు ఫోన్ చేసి వివరాలు ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్వామి, ఎస్సై రవికుమార్ తెలిపారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

జగిత్యాలలో మాట్లాడుతున్న జగదీశ్వర్

జగిత్యాల ధరూర్ క్యాంపు, న్యూస్‌టుడే: మేనిఫెస్టో హామీ మేరకు రాష్ట్రప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారుల సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగ ఐకాస రాష్ట్ర ఛైర్మన్ మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు. జగిత్యాలలోని టీఎన్జీవో కార్యాలయంలో సోమవారం జరిపిన ఐకాస జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని, 10న చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. పీఆర్సీ అమలు, పెండింగ్‌లోని 6 డీఏల విడుదల, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలన్నారు. ఐకాస జిల్లా ఛైర్మన్ మిర్యాల నాగేందర్‌రెడ్డి, కన్వీనర్ కందుకూరి రవిబాబు, పలు సంఘాల నాయకులు అమరేందర్‌రెడ్డి, వకీల్, అమర్‌నాథ్‌రెడ్డి, హరికిరణ్, సురేశ్, హరి అశోక్‌కుమార్, శ్రీనివాస్, రవీందర్, అరుణ, కరుణాకర్, విజేందర్, గంగనర్సయ్య, మహమూద్, శైలజ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మునిగి యువకుడి మృతి

భూయ్యాన్

మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: చేపల కోసం వెళ్లి చెరువులో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని అడవి సోమన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మంథని ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన చోటు భూయ్యాన్(26) గ్రామంలో సమీకృత వసతి గృహ భవన నిర్మాణ పనుల్లో కూలీగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం గ్రామంలోని అడవిలోని మిడి చెరువులో చేపలు పట్టేందుకు నలుగురు వెళ్లారు. వీరిలో భూయ్యాన్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందారు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపకశాఖ అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. సైట్ ఇన్‌ఛార్జి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు. అగ్నిమాపకశాఖ అధికారి శివశంకర వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి..

కార్తిక్

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: వ్యాపారాలు చేసి నష్టాలు రావడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యాపారి కరీంనగర్‌లోని ఓ లాడ్జిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఒకటో ఠాణా ఎస్సై శేఖర్ వివరాల ప్రకారం వేములవాడకు చెందిన నరాల కార్తిక్ (33) చీటీల వ్యాపారం చేస్తుండేవారు. నష్టాలు రావడంతో మూడేళ్లుగా రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేశారు. అందులోనూ నష్టాలు రావడంతో అప్పులపాలయ్యారు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైన కార్తిక్ తన కారులో కరీంనగర్‌కు పనిపై వెళ్తున్నట్లు భార్యకు చెప్పారు. రాత్రి భార్య ఫోన్ చేయగా లిఫ్ట్ చేయపోవడంతో కుటుంబ సభ్యులు కరీంనగర్‌లో వెతకడం ప్రారంభించారు. అలకాపురి కాలనీలోని ఓ లాడ్జి వద్ద కారు కనిపించడంతో వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM) జగిత్యాల 99480 71117 కోరుట్ల 9491324656 ధర్మపురి 94403 88638

13 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం

సమావేశంలో మాట్లాడుతున్న పురపాలక ఛైర్మన్ లింబాద్రి

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని వార్డుల్లో రోడ్లు పూర్తిగా చెడిపోయి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వెంటనే సీసీ వేయించాలని పలువురు కౌన్సిలర్లు అధికారులకు దృష్టికి తీసుకువచ్చారు. సోమవారం మెట్‌పల్లి బల్దియా ఛైర్మన్ లింబాద్రి అధ్యక్షతన పురపాలక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యాలయ ఉద్యోగి ఎజెండాలో పొందుపరిచిన 13 అంశాలను చదివి వినిపించడంతో కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. పురపాలక ఛైర్మన్ మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. బల్దియా కమిషనర్ శ్రీనివాస్, డీఈఈ నాగేశ్వర్‌రావు, వైస్ ఛైర్మన్ నవీన్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: ఇటీవల హుస్నాబాద్‌లో దక్షిణ భారత స్థాయిలో నిర్వహించిన కరాటే పోటీల్లో జగిత్యాల పట్టణంలోని పవన్ కరాటే అకాడమీకి చెందిన పలువురు విద్యార్థులు పతకాలు సాధించారని శిక్షకుడు పవన్ తెలిపారు. ఇందులో విహార్, సాన్విక బంగారు పతకం.. ఫైజాన్, మహావీర్, దీహార్, కార్తిక్, శ్రీహాన్, విష్ణు, శుశాంత్, శ్రీవల్లి, హదియా, ఆరాధ్య, కావ్యలు కాంస్య పతకాలు సాధించారన్నారు. వారిని పరిశీలకులు రచ్చ శ్రీనుబాబు అభినందించారు.

పతకాలు సాధించిన విద్యార్థులు

కాలువ పనులకు భూమిపూజ

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని అన్ని వార్డుల్లో రూ.18.70 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులు నిలిచిన విషయాన్ని అసెంబ్లీలో మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పనులను ప్రారంభించేలా దృష్టి సారిస్తానని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. సోమవారం 8వ వార్డులో పురపాలక ఛైర్మన్ లింబాద్రితో కలిసి కాలువ పనులకు భూమిపూజ చేసి కొబ్బరికాయలు కొట్టారు. కమిషనర్ శ్రీనివాస్‌గౌడ్, డీఈఈ నాగేశ్వర్‌రావు, వైస్ ఛైర్మన్ నవీన్, కౌన్సిలర్ మానస-విష్ణు, పలు వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పనులకు కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే సంజయ్

సంకల్ప సభకు తరలిన నాయకులు

సభకు తరలుతున్న నాయకులు

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: నిజామాబాద్‌లో జరిగిన తెలంగాణ రక్షణ సేన పాంచజన్య సంకల్ప సభకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి డా.రఘు ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో నిజామాబాద్‌కు తరలి వెళ్లారు. నాయకులు సుఖేందర్, లింగంపల్లి సంజీవ్, రాజన్న, ప్రణీత్, చంద్రశేఖర్, నాగరాజు, ముఖీం, రవితేజ, విజయ తదితరులు పాల్గొన్నారు.

సంఘం భవనానికి స్థలం కేటాయించాలి

మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన మహిళలు

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని 12వ వార్డులో మహిళా సంఘ భవనం, అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని ఆర్డీవో నరసింహారావుకు వినతిపత్రం సమర్పించారు. వార్డు మహిళా సంఘాల సభ్యులు సోమవారం ఆర్డీవో కార్యాలయానికి తరలివచ్చారు. అధికారులు స్థలాన్ని కేటాయించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

హద్దులు లేక ఇబ్బందులు

బీమారం, న్యూస్‌టుడే: బీమారం మండలం రాగోజిపేటలో ఏళ్ల క్రితం ప్రభుత్వం పేదలకు పట్టాలు ఇచ్చిన భూములకు హద్దులు నిర్ణయించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సర్పంచి చెన్నమనేని అజిత్‌రావు కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. పాస్‌బుక్కులు ఉన్నా.. బ్యాంకు రుణాలు, రైతుబంధు అందక ప్రభుత్వ ప్రయోజనాలు పొందడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుత రీ సర్వేతో రైతుల భూములకు హద్దులు నిర్ణయిస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

రెండేళ్లలో ఎమ్మెల్యే ఏం చేశారో చెప్పాలి

జగిత్యాల, న్యూస్‌టుడే: మాజీ సీఎం కేసీఆర్ చొరవతో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన స్థానిక ఎమ్మెల్యే సంజయ్ అభివృద్ధి పేరిట ఆరు నెలలకే కాంగ్రెస్‌లో కలిశారని.. ఈ రెండేళ్లలో ఏం చేశారో చెప్పాలని భారాస ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, అక్రమాలు జరిగినా పట్టించుకోకపోవడం చూస్తే ఎమ్మెల్యేకు సంబంధాలు ఉన్నట్లు భావించాల్సి వస్తుందని ఆరోపించారు. నాయకులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటి ట్యాంకు

పెగడపల్లి మండలంలోని సుద్దపల్లి పంచాయతీ భవనం సమీపంలో నిర్మించిన ఉపరితల నీటి ట్యాంకు నిరుపయోగంగా మారింది. ఈ ట్యాంకు నుంచి పంచాయతీ పరిసరాలు, ఆరవెల్లి రోడ్డులోని పలు వీధులకు కనెక్షన్ ఇచ్చినప్పటికీ ఏనాడూ నీరు రావడం లేదని, మిషన్ భగీరథ నీరు సైతం ట్యాంకులోకి చేరడం లేదని అధికారులు చెబుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించి ఎనిమిదేళ్లయినా ట్యాంకు ఉపయోగంలో లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, పెగడపల్లి

అడుగు మేర కోత



కొడిమ్యాల మండలం దొంగలమర్రి చెక్‌పోస్టు సమీపంలోని జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారి మలుపు వద్ద రోడ్డును ఆనుకుని అడుగు మేర మట్టి కోతకు గురవడంతో ప్రమాదకరంగా మారింది. ఎదురుగా భారీ వాహనాలు వచ్చినప్పుడు రోడ్డు దిగాలంటే వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి కోతకు గురైన ప్రాంతాల్లో మట్టి పోయించాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కొడిమ్యాల

ప్రాణాలు పోతే గానీ.. పట్టదా?

మల్లాపూర్ మండలం ఒబులాపూర్‌లో బస్టాండ్ సమీపంలో విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదు. జాతీయ రహదారి పక్కనే ఉండగా.. పశువులతో పాటు మనుషులకు ప్రమాదం పొంచి ఉంది. ప్రాణాలు పోతే గానీ అధికారులు పట్టించుకోరా అని పలువురు మండిపడుతున్నారు. - న్యూస్‌టుడే, మల్లాపూర్

రహదారిపైనే వరద

మల్లాపూర్ మండలం ఒబులాపూర్ బస్టాండ్ సమీపంలో ఆర్అండ్‌బీ రహదారిపై వరద రోజుల తరబడి నిలిచి ఉండటంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. భారీ వాహనాలు వచ్చినప్పుడు బురద ద్విచక్ర వాహనదారులపై పడటంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అధికారులు స్పందించి నీటిని తొలగించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మల్లాపూర్

వారంలోగా పరిష్కరించాలని సీఎం ఆదేశం

● ప్రజావాణి వినతులపై దిశానిర్దేశం

జగిత్యాల, న్యూస్‌టుడే: ప్రజావాణి వినతులను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లత అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజగౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వై.ప్రసాద్‌తో కలిసి ప్రజల సమస్యలు విన్నారు. ఈ సందర్భంగా 53 ఫిర్యాదులు, వినతులు రాగా పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖలకు రాశారు. ఇదే సందర్భంగా అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి ప్రజావాణిలో జిల్లాకు సంబంధించిన సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతనిచ్చి వారంలోగా పరిష్కరించాలన్నారు. ఇప్పటినుంచి సెప్టెంబర్ 25 వరకు నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ అన్నారు.

సమస్యలు వింటున్న అదనపు కలెక్టర్లు, డీఆర్వో

వాలంటీర్లకు భద్రత కల్పించండి

జిల్లాలో విధులు నిర్వహిస్తున్న తమకు భద్రత కల్పించాలని డీసీఎస్ వాలంటీర్లు కోరారు. ఈ మేరకు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం తమకు అప్పగించిన విధులు బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నామని, విధి నిర్వహణలో ఇబ్బందులు రాకుండా భద్రత కల్పించాలన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం కేవలం ఒక్కో ఫొటోకు రూ.7 చెల్లిస్తున్నారని ప్రయాణ ఖర్చులు, మొబైల్ డాటా పెరిగిన విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రూ.15 చెల్లించాలని వారు కోరారు.

అర్హులైన వారికే పింఛన్లు ఇవ్వాలి

అర్హులైన గీత కార్మికులకే ఆసరా పింఛన్లు ఇవ్వాలని జగిత్యాల, మోతె, తిమ్మాపూర్ గౌడ, కల్లు, గీత పారిశ్రామిక సహకార సంఘ సభ్యులు కోరారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. తమ సంఘంలో సభ్యత్వం లేకున్నా కొందరు తప్పుడు గుర్తింపు కార్డులను తయారు చేసి ఆసరా పింఛను కోసం దరఖాస్తు చేసుకుంటున్నారన్నారు.

మండలాల్లో ఇలా..

కోరుట్ల: మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూశాఖ 3, మున్సిపల్ 2, విద్యాశాఖ 1, గృహ నిర్మాణశాఖ 2, ఆర్టీసీ 1 చొప్పున మొత్తం 9 దరఖాస్తులను ప్రజలు సమర్పించినట్లు ఎంపీడీవో తెలిపారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత శాఖలకు సూచించినట్లు పేర్కొన్నారు.

కథలాపూర్(కోరుట్ల): మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, ఆర్అండ్‌బీ, నీటిపారుదలశాఖకు సంబంధించిన మొత్తం 3 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో శంకర్ తెలిపారు.

మల్యాల: మల్యాలలో రెవెన్యూశాఖకు చెందిన సమస్యల పరిష్కారం కోరుతూ ఎనిమిది దరఖాస్తులు సమర్పించగా, రెండు పంచాయతీరాజ్, ఒకటి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తులు అందజేసినట్లు ఎంపీడీవో స్వాతి తెలిపారు. మరికొంతమంది భూసమస్యలు, పట్టాదారు పాసుపుస్తకాల కోసం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ఆడిటోరియం నిర్మించండి

జగిత్యాల తహసీల్ చౌరస్తాలోని పాత తహసీల్ కార్యాలయం స్థలాన్ని అంబేడ్కర్ ఆడిటోరియం నిర్మాణానికి కేటాయించాలని భాజపా ఎస్సీ మోర్చా నాయకులు కోరారు. జిల్లా అధ్యక్షుడు అశోక్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.

ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సహాయం

జగిత్యాల, న్యూస్‌టుడే: చట్టాలపై అవగాహన తప్పనిసరని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి సరిత అన్నారు. సోమవారం జగిత్యాల పురాతన ఉన్నత పాఠశాలలో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ హక్కులు, బాధ్యతల గురించి తెలుసుకోవాలని.. కష్టపడి చదివి తల్లిదండ్రులు, సమాజానికి మంచిపేరు తేవాలన్నారు. అవసరమైన ప్రతి ఒక్కరికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని వినియోగించుకోవాలన్నారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె.చంద్రమోహన్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ ఆర్.విజయక్రిష్ణ, సీహెచ్.అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న న్యాయమూర్తి సరిత

ఆలయాల్లో భక్తుల రద్దీ

ధర్మపురి, న్యూస్‌టుడే: ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శ్రావణమాసం సోమవారం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో లఘున్యాస పూర్వకంగా రుద్రాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అక్కపల్లి శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ ఏర్పడింది. సంకష్ట హర చతుర్థి సందర్భంగా గణపతికి పూజలు చేశారు. దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. దేవస్థానానికి రూ.2,06,722 ఆదాయం సమకూరింది.

ఉచిత వైద్యం అభినందనీయం

గొల్లపల్లి, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత వాసులకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని సీఐ రాంనర్సింహారెడ్డి పేర్కొన్నారు. గొల్లపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా సీఐ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, సర్పంచి నీరజరెడ్డి, ఉపసర్పంచి బుచ్చిరెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ రాంనర్సింహారెడ్డి, తదితరులు

చిత్తశుద్ధితో పనిచేస్తేనే గుర్తింపు

జగిత్యాల : ప్రభుత్వ అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేస్తే చిరస్థాయి గుర్తింపు లభిస్తుందని అదనపు కలెక్టర్లు బీఎస్ లత, రాజాగౌడ్ అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఉద్యోగ విరమణ పొందిన బుగ్గారం తహసీల్దార్ నరేందుల భూమేశ్వర్‌ను వారు సన్మానించి మాట్లాడారు.

50 వేల మంది ఉపాధ్యాయులతో మహా ధర్నా

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి

జగిత్యాల, న్యూస్‌టుడే: హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద మంగళవారం 50 వేల మంది ఉపాధ్యాయులతో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం పీఆర్టీయూ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై నిర్లక్ష్యం చేస్తుందని.. ముఖ్యమంత్రి పీఆర్సీ నివేదిక తెప్పించుకుని 3 నెలలు గడిచినా పట్టించుకోవడం లేదన్నారు. సీపీఎస్ రద్దు చేస్తామని ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నారని వెంటనే పాత పింఛను విధానం అమలు చేయాలన్నారు. పెండింగ్ బిల్లులు పూర్తిస్థాయిలో చెల్లించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, జీవో 25ను సవరించి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు.

పీఆర్టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అమర్‌నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బోయిన్‌పల్లి ఆనందరావు, అసోసియేటెడ్ అధ్యక్షులుగా నర్సయ్య, రవికుమార్, గూడూరి శ్రీదేవి, ప్రశాంతి, ఉపాధ్యక్షులుగా పలువురు ఎన్నికయ్యారు.

డంపింగ్ యార్డు ఏర్పాటు చేయరా: భారాస

ధర్మపురి, న్యూస్‌టుడే: ధర్మపురి పురపాలికలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం లేదని, దీంతో నదీ తీరంలో చెత్త వేయడంతో కలుషితమవుతోందని భారాస నాయకులు విమర్శించారు. సోమవారం నదీ తీరంలోని డంపింగుయార్డు ప్రదేశాన్ని పరిశీలించారు. నాయకులు మాట్లాడుతూ.. మున్సిపాలిటీకి డంపింగ్‌యార్డు కేటాయించకపోవడం అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. నదీ తీరంలోని శ్మశాన వాటిక వద్ద పడేస్తుండటంతో భక్తులకు తీవ్ర అసౌకర్యంగా మారిందన్నారు. స్వచ్ఛ గోదావరి అంటూ శ్మశాన వాటిక కింది ప్రదేశంలో చెత్తనంతా పడేశారన్నారు. కలెక్టర్ డంపింగ్‌యార్డు సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మండల భారాస నాయకులు అయ్యోరి రాజేష్‌కుమార్, రంజిత్, సంగి శేఖర్, పెరుమాండ్ల ఎల్లాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: చల్‌గల్ జిల్లా పరిషత్తు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనుమల్ల లతాదేవి పదవీ విరమణ వేడుక సోమవారం జరగగా.. ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఉత్తమ సేవలతోనే గుర్తింపు వస్తుందన్నారు. సర్పంచి రాజేందర్, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్, పీఆర్‌టీయూ కార్యదర్శి రాజేందర్, బన్న, ఏవీఎన్‌రాజు, సురేశ్, రాంరెడ్డి, ఎల్ల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలు లతాదేవిని సన్మానిస్తున్న ఉద్యోగులు

పండగలకు పకడ్బందీ ఏర్పాట్లు

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: పారిశుద్ధ్యం, తాగునీరు, వసతులు, సౌకర్యాలకు ప్రాధాన్యత కల్పించడంతోపాటు, పండుగల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు బల్దియా అధ్యక్షురాలు వాణి అన్నారు. జగిత్యాల బల్దియా కార్యాలయంలో ఆమె అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వినాయక నిమజ్జనం, సుందరీకరణ, భద్రత, విద్యుత్తు, రహదారుల అభివృద్ధి తదితర ఏర్పాట్లకు రూ.33.81 లక్షలు, జంబిగద్దె వద్ద రంగులు, బారికేడ్లు తదితర పనులకు రూ.37.13 లక్షలు కేటాయిస్తున్నట్లు చెప్పారు. తాగునీటి సరఫరా, రెండు జోన్లలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు, క్రీడా మైదానాల అభివృద్ధి, సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు రూ.30 లక్షల వరకు.. ఆటో టిప్పర్లు, బ్లేడు ట్రాక్టర్, టిప్పర్ తదితర వాహనాల కొనుగోలుకు రూ.1.47 కోట్లు కేటాయించగా పాలకవర్గం ఆమోదం తెలిపింది. ఉపాధ్యక్షురాలు జీనత్ పర్వీన్, కమిషనర్ సత్యప్రణవ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బల్దియా అధ్యక్షురాలు వాణి

సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు

గత పాలకవర్గ సమావేశంలో పాలనా అనుమతులు పొందిన 16 పనులకు టెండర్ చేపట్టకపోగా.. కలెక్టర్ అనుమతితో అత్యవసర పనుల కింద అర్బన్ హౌసింగ్ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టడంపై కౌన్సిలర్ దేవేంద్ర నాయక్ అభ్యంతరం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య విభాగంలో వాహనాల మరమ్మతులు ఉన్నాయని పేర్కొంటూనే డీజిల్ ఖర్చు రూ.11.80 లక్షలు బిల్లులు సమర్పించడం, గత నెలలో ఎలాంటి ముఖ్య కార్యక్రమాలు లేనప్పటికీ రూ.2.20 లక్షలు ఖర్చులు చూపడంపై 50వ వార్డు కౌన్సిలర్ మమత అభ్యంతరం వ్యక్తం చేశారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

రమేశ్

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామంలో కుటుంబ కలహాలతో ఒక యువకుడు(32) ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. అల్లెపు రమేశ్ కొన్నేళ్లుగా ఉపాధి నిమిత్తం దుబాయ్‌లో ఉండి రెండు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చారు. రమేశ్ కుటుంబ విషయాలకు సంబంధించి భార్యతో తరచూ గొడవలు పెట్టుకునేవారు. ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంట్లో ఎవరు లేని సమయం చూసి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. రమేశ్ తండ్రి గంగరాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ పేర్కొన్నారు.

బస్సు ఢీ.. వృద్ధుడికి తీవ్రగాయాలు

కథలాపూర్(కోరుట్ల), న్యూస్‌టుడే: కథలాపూర్ బస్టాండ్‌లో సోమవారం ఓ వృద్ధుడిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. కథలాపూర్‌కు చెందిన గంగారాం నడవలేని స్థితిలో ఉండగా బస్టాండ్ ఆవరణలోని నేలపై పాకుతూ వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సు ముందు టైరు వృద్ధుడు కాలుపై నుంచి వెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడగా.. కోరుట్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్సై రవికిరణ్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు.

70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
మా కస్టమర్లకు, పాలసీదారులకు, ఏజెంట్ మిత్రులకు, ఆఫీస్ సిబ్బందికి, మిత్రులకు 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.
GATTU RAJAIAH
చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ ఛైర్మన్స్ క్లబ్ మెంబర్
Cell: 9440072899, Assts: 7396433280, 9652186337.
Office: 2nd Shutter, Police Head Quarters, Karimnagar

సంక్షిప్తం

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

మల్యాల, న్యూస్‌టుడే: మల్యాల మండలం తాటిపల్లిలోని 11కె.వి మానాల ఫీడర్, తక్కళ్లపల్లి ఉపకేంద్రం పరిధిలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఆయా ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ దయానంద్ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శుద్ధ జల యంత్రం అందజేత

రాయికల్ : రాయికల్ మండలం కుర్మపల్లి ప్రాథమిక పాఠశాలకు సోమవారం సర్పంచి మల్లేశం రూ.18 వేల విలువ గల శుద్ధ జల యంత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచిని ఉపాధ్యాయులు సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు ఎలిగేటి రాజకిషోర్, ఉప సర్పంచి పుల్లలత, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు

రాయికల్ : నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. రాయికల్ మండలంలోని చింతలూరు, రామాజిపేట, రాయికల్, ఇటిక్యాలలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని లబ్ధిదారులకు చీరలను కానుకగా అందజేశారు. ఆత్మ ఛైర్మన్ గంగారెడ్డి, సర్పంచులు వనిత, శ్రీను, మోహన్, కౌన్సిలర్ మచ్చ గంగలక్ష్మి, నాయకులు కోల శ్రీను, గన్నెరాజరెడ్డి, మహేందర్‌బాబు, అచ్యుతరావు, వాసం రాజేందర్ తదితరులున్నారు.

కోరుట్ల ఠాణా తనిఖీ

కోరుట్ల : కోరుట్ల ఠాణాను డీఎస్పీ రాములు సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి స్టేషన్‌లో సిబ్బంది విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తులో పురోగతి, పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై శ్యామ్‌రాజ్ ఉన్నారు.

పర్యటించి.. సమస్యలు తెలుసుకొని

కథలాపూర్(కోరుట్ల) : కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామంలో సోమవారం అధికారులు పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాలనీలో పర్యటించి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐ రవీందర్, సర్పంచి సుధాకర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులు నిర్ణయించిన తర్వాతే కొలతలు

మల్లాపూర్ : మల్లాపూర్ మండలం ఒబులాపూర్-సంగెంశ్రీరాంపూర్ గ్రామాల మధ్య గ్రామ సరిహద్దులను తేల్చిన తర్వాతే భూముల రీ సర్వే కొలతలను నిర్వహించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. 1972లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో పునరావసం పేరిట తమ గ్రామాన్ని ఆనుకొని సంగెంశ్రీరాంపూర్, రత్నాపూర్ గ్రామాలను కేటాయించారన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు సరిహద్దులను తేల్చకపోవడంతో తరచూ ఇరు గ్రామాల మధ్య విభేదాలు తలెత్తుతున్నాయన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామన్నారు. కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ చర్యలు తీసుకోవాలని కోరారు.

విధుల్లో నిర్లక్ష్యంపై ఫిర్యాదు

రాయికల్ పట్టణం: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బూత్‌లెవల్ అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణంలోని 9వ వార్డుకు చెందిన ఎం.డి ముజాఫర్ ప్రజావాణిలో ఎంపీడీవో చిరంజీవికి సోమవారం ఫిర్యాదు చేశారు. సర్ ప్రక్రియలో జారీ అయిన నోటీసులను సంబంధిత ఓటర్లకు పంపిణీ చేయకుండా తన ఇంటికి వచ్చి తీసుకెళ్లాలని.. లేదంటే తమ ఇష్టం అంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాలకు బస్సులు పెంచాలంటూ ధర్నా

కోరుట్ల : కోరుట్ల మండలం కల్లూర్ గ్రామ శివారులోని మోడల్ స్కూల్‌కు కేవలం రెండు బస్సులను నడపడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ సోమవారం విద్యార్థులు, నాయకులు ధర్నా చేపట్టారు. సుమారు 300 మంది విద్యార్థులకు కేవలం రెండు బస్సులను సమకూర్చడంతో కిక్కిరిసిపోతున్నారని వాపోయారు. విద్యార్థుల కోసం నిత్యం 3 బస్సులను తప్పకుండా నడిపేలా చర్యలు తీసుకుంటామని డీఎం తెలుపడంతో ఆందోళన విరమించారు.

మున్సిపల్ ఛైర్మన్‌కు పరామర్శ

రాయికల్ పట్టణం: రాయికల్ మున్సిపల్ ఛైర్మన్ కట్కం రవీందర్ తల్లి కట్కం లక్ష్మి అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం మృతి చెందారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీమంత్రి జీవన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. పలువురు సర్పంచులు ఉన్నారు.

పక్షవాత బాధితుడికి రూ.1.27 లక్షల సాయం

ధర్మపురి : బ్రెయిన్ స్ట్రోక్‌తో కాలు, చేయి, నోటి మాట పడిపోయిన ఓ బాధితుడికి వైద్యం కోసం సామాజిక మిత్రులు రూ.1.27 లక్షల సాయం అందించారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో నివాసముంటున్న చిలుకూరు సత్తయ్య కొన్ని సంవత్సరాల నుంచి టైలరింగు పని చేస్తూ భార్య, ఇద్దరు కుమారులతో కలిసి అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. 10 నెలల కిందట పక్షవాతం సోకడంతో మంచానికి పరిమితమయ్యాడు. భార్య మంజుల బీడీలు చేస్తుండగా, ఇద్దరు కుమారులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. సత్తయ్య వైద్య ఖర్చులకు ఆ కుటుంబం ఇబ్బందులు పడుతుండగా ధర్మపురికి చెందిన రేణికుంట రమేశ్ ఆగస్టు 3న ఫేస్‌బుక్‌లో పోస్టు చేసి సాయం కోరారు. దాతలు సత్తయ్య దంపతుల బ్యాంకు ఖాతాకు రూ.1.27 లక్షలు పంపించారు. వాటిని లక్షెట్టిపేట యూనియన్ బ్యాంకు మేనేజర్ మహేశ్ చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేయించారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

గొల్లపల్లి : సీసీ కెమెరాల ఏర్పాటుతో ముందుగానే నేరాలను నిరోధించడంతో పాటు, నిందితులను గుర్తించడానికి ఎంతో ఉపయోగపడతాయని ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి పేర్కొన్నారు. చెందోళిలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం సీఐ ప్రారంభించి మాట్లాడారు.

హార్దిక శుభాకాంక్షలు

శ్రీ అన్నమనేని సుధాకర్‌రావు గారు అధ్యక్షులు
శ్రీ భోనగిరి శశికిరణ్ గారు జనరల్ సెక్రటరీ
శ్రీ గిరిధర్‌లాల్ డోడియా గారు కోశాధికారి
జిల్లా రైస్‌మిల్లర్స్ సంక్షేమ సంఘం, కరీంనగర్
కరీంనగర్ జిల్లా రైస్‌మిల్లర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన శ్రీ అన్నమనేని సుధాకర్‌రావు గారికి
జనరల్ సెక్రటరీగా నియమింపబడిన శ్రీ భోనగిరి శశికిరణ్ గారికి
కోశాధికారిగా నియమింపబడిన శ్రీ గిరిధర్‌లాల్ డోడియా గారికి
మా హార్దిక శుభాకాంక్షలు
రేగొండ కిషన్ అధ్యక్షులు | MA Saleem (Sajeed) General Secretary | SYED MINHAJ UDDIN Treasurer
మరియు పాలకవర్గ సభ్యులు
కరీంనగర్ పట్టణ లారీ అసోసియేషన్

(c) eenadu